


అన్నపూర్ణగా అమ్మవారు



గూడూరు మండలం నాగులాపురం గ్రామంలో అన్నపూర్ణగా దర్శనమిస్తున్న సుంకులా పరమేశ్వరీ దేవి

8లో

రావణ వాహనంపై చంద్రఘంట

శ్రీశైలంలో వైభవంగా దసరా ఉత్సవాలు



క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవం

శ్రీశైలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో దసరా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మూడోరోజు బుధవారం భ్రమరాంబికా అమ్మవారు చంద్రఘం ట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ అలంకరణలో అమ్మవారు దశ భుజాలను కలిగి ఉండి ప్రశాంతమైన వదనంతో సాత్విక స్వరూపిణిగా దర్శనమిచ్చారు. అమ్మవారి మస్తకంపై అర్ధచంద్రుడు అలరాడుతున్న కారణంగా ఈ దేవిని చంద్ర ఘంటాదేవిగా పిలుస్తారు. ఈ దేవిని పూజించడంతో కష్టాలన్నీ తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఈదేవిని ఆరాధించడం వల్ల సౌమ్యం, వినమ్రత కలుగుతాయని వేదపండితులు తెలిపారు. అమ్మవారికి బిల్వదళాలతో శాస్త్రోక్తంగా అర్చకులు, వేదపండితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సుగంధ ద్రవ్యాలతో ధూప దీప నైవేద్యాలతో పూజించారు. మహామంగళ హారతులిచ్చారు. అమ్మవారి క్షేత్రంలో కుమారి పూ జలు చేశారు. భ్రమరాంబికా అమ్మవారిని చంద్రఘంట అలంకారంలో అలాగే మల్లికార్జునస్వామి అమ్మవార్లను రావణ వాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్పూర హారతులు ఇచ్చారు. గ్రామోత్సవానికి ఆది దంపతులు బయలుదేరగా ఉత్సవమూర్తుల ఎదుట కోలాటాలు, గిరిజన నృత్యాలు, వివిధ రకాల విన్యాసాలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఆలయం లోపలి నుంచి బాజా భజంత్రీలు, బ్యాండ్ వాయిద్యాల నడుమ అమ్మవారులు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



రావణ వాహనంపై శివపార్వతులు

నేడు కూష్మాండదుర్గ అలంకరణ

దసరా ఉత్సవాల్లో నాలుగో రోజు గురువారం అమ్మవారు కూష్మాండ దుర్గగా భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం శివయ్యతో కలిసి అమ్మవారు కైలాస వాహనంపై విహరిస్తారు.

ఎమ్మెల్యే కనబడితే సమాచారమివ్వండి

- నాగనాథనహళ్లి గ్రామస్థులు
- రోడ్డుపై మొక్కలు నాటి నిరసన
- సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



నాగనాథనహళ్లి ప్రధాన రహదారిలో ఆగిన వర్షపునీటిలో మొక్కలు నాటుతున్న గ్రామస్థులు

ఆదోని రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి కనబడితే తమకు సమాచారమివ్వాలని, ఎన్నికల ముందు వచ్చి హామీలిచ్చి కనిపించకుండా పోయారంటూ నాగనాథనహళ్లి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు తనను గెలిపిస్తే రెండు నెలల్లో రోడ్లు వేయిస్తానని చెప్పి 20నెలలైనా పట్టించుకోకపోవడంతో బుధవారం వారు ఆందోళనబాట పట్టారు. గ్రామ ప్రధాన రహదారి గుంతలమయమై వర్షపునీటితో నిండి పోయిందని, తాము ఈ రహదారిపై ఎలా తిరిగేదంటూ ప్రశ్నించారు. రోడ్డుపై ఆగిన నీటిలో పలురకాల మొక్కలు నాటి నిరసన తెలిపారు. ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అసెంబ్లీలో రోడ్లపై మాట్లాడకుండా ఆదోనిని జిల్లా చేయాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

పవర్‌గ్రిడ్‌కు భూములివ్వం

- జేసీకి తేల్చి చెప్పిన మనేకుర్తి గ్రామ రైతులు
- భూములు లాక్కుంటే ఆందోళన చేపడుతాం
- సీపీఐ, రైతు సంఘం నాయకులు



జేసీ నవ్యకు సమస్యను వివరిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఆలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంటలు పండే సాగు భూములను పవర్ గ్రిడ్ ఏర్పాటుకు ఇచ్చేదే లేదని మనేకుర్తి గ్రామ రైతులు జాయింట్ కలెక్టర్ నవ్యకు తేల్చి చెప్పారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో పవర్‌గ్రిడ్ ఏర్పాటుపై రైతులలతో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మంజూరు చేసిందని, భూములు ఇస్తే ఎకరాకు రూ.18లక్షలు పరిహారమిస్తామని తెలిపారు. ఇందు కోసం రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూములివ్వకపోతే నిబంధనల ప్రకారం పవర్‌గ్రిడ్‌కు భూములు తీసుకుంటామని తెలిపారు. ఆ తర్వాత ఎకరాకు రూ.6లక్షలు మాత్రమే పరిహారం ఇస్తామని అధికారులు తెలిపారు. రైతుల నుంచి భూములు లాక్కొని పవర్‌గ్రిడ్ పెడితే నిరసనలు, ఆందోళన బాట పడతామని సీపీఐ, రైతు సంఘం నాయకులు భూపేష్, చాపల గోపాల్ హెచ్చరించారు. మెజార్టీ రైతుల అంగీకారం మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభానువర్ధమ్మ, డీటీ విజయ్‌కుమార్, ఆర్‌ఐ బసవన్న గౌడ్ పాల్గొన్నారు.

వేరుశనగ ధరల్లో కదలిక

- క్వింటా గరిష్ఠంగా రూ.6,520



వేరుశనగ దిగుబడులకు తూకాలు వేస్తున్న హమాలీలు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధరలు బుధవారం పుంజుకున్నాయి. వారం రోజుల నుంచి వేరుశనగ ధరలు పతనం కావడంతో రైతులు ఆందోళన చెందారు. ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగా సాగు చేసిన వేరుశనగ దిగుబడులు చేతికందడంతో విక్రయానికి రైతులు భారీగా తీసుకొస్తున్నారు. ధరలు మళ్లీ పెరగడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మార్కెట్‌కు 988 వేరుశనగ బస్తాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.3,199, మధ్యధర రూ.6,317, గరిష్ఠ ధర రూ.6,520 పలికింది.

ఎప్పుడిస్తారో..!

'రెండెకరాల్లో ఉల్లి సాగు చేస్తే 250 బస్తాలు (125 క్వింటాళ్లు) దిగుబడి వచ్చింది. క్వింటా రూ.రెండు మూడు వందలు కూడా పలకకపోవడంతో చేస్లోనే వదిలేద్దామనుకున్నా.. ప్రభుత్వమోళ్లే కింటాలు రూ.1,200లకు కొంటుదని చెప్పారు.. పెట్టుబడిలో కొంతైనా చేతికొస్తుందనే ఆశతో పంటకోత, రవాణా ఖర్చులకు మరో రూ.45 వేలు అప్పు చేసి కర్నూలు మార్కెట్‌కు తీసుకొచ్చాను. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొన్నారు. నాకు రూ.1.25 లక్షలు రావాల్సి ఉంది. 15 రోజులైనా సొమ్ము రాలేదు. అప్పులు ఇచ్చినవారు మా ఇంటి చుట్టూరా తిరుగుతున్నారు. ఉల్లి అమ్మిన దుడ్లు ఎప్పుడిస్తారో ఏమో..'
- సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన ఓ రైతు ఆవేదిన ఇది.


- ధరలు పతనమై నష్టపోయిన ఉల్లి రైతులు
- మద్దతు ధర రూ.1,200 ప్రకటించిన ప్రభుత్వం
- 1.50 లక్షల క్వింటాళ్ల సేకరణ
- రైతులకు బకాయిలు రూ.15.18 కోట్లు
- ఉల్లి డబ్బు కోసం అన్నదాతల నిరీక్షణ
- రూ.50 వేల సాయం కోసం ఎదురుచూపు

కర్నూలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు విస్తీర్ణం 45,278 హెక్టార్లు. ఈ ఏడాది ఈ-క్రాప్ రికార్డుల ప్రకారం 52,306 ఎకరాల (20,923 హెక్టార్లు)లో సాగు చేశారు. ఈ నెఖారుల వరకు ఈ-క్రాప్ నమోదుకు అవకాశం ఉండడంతో మరో 2-3 వేల ఎకరాలు పెరిగే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారుల అలంచనా. పంట దిగుబడులు చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలకు ఉల్లి దిబ్బతిని దిగుబడి కూడా భారీగా తగ్గిపోయింది. చేతికొచ్చిన అరకొర పంట దిగుబడులు అమ్ముదానికి కర్నూలు మార్కెట్ వస్తే.. ధరలు పతనమై కష్టజీవులు కన్నీళ్లు పెట్టారు. క్వింటా కనిష్ఠంగా రూ.వంద కూడా పలకని పరిస్థితి. మట్టిలో పోసిన పెట్టుబడి, భార్యపిల్లలు పొలంలో చేసిన కష్టం దేవుడెరుగు.. పంట కోత, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో పలువురు రైతులు పొలంలోనే వదిలేశారు. ఉల్లి రైతుల కన్నీటి వ్యథలను ఆంధ్రజ్యోతి వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. సీఎం చంద్రబాబు సారథ్యంలోకి కూటమి ప్రభుత్వం స్పందించి ఉల్లి రైతులకు అండగా నిలబడింది. మద్దతు ధర క్వింటాకు రూ.1,200 ప్రకటించింది. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. పెట్టుబడిలో కొంతైనా చేతికొస్తుందని, చేసిన అప్పుకు వడ్డీలైనా చెల్లించవచ్చని ఉల్లి దిగుబడులు మార్కెట్‌కు తీసుకొచ్చారు. సాగు పెట్టుబడి కాదని పంట కోత, రవాణా కోసం ఎకరాకు రూ.35-40 వేల వరకు అప్పులు చేశారు.

- **కొన్న ఉల్లికి డబ్బుల కోసం..**

కర్నూలు మార్కెట్ యార్డులో ఆగస్టు 31న మద్దతు ధర రూ.1,200 ప్రకారం ఏపీ మార్క్‌ఫెడ్ నేరుగా ఉల్లి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. అదే క్రమంలో మార్కెట్ యార్డు లైసెన్స్‌డ్ వ్యాపారులు పర్చేజ్ డిఫరెంట్ ప్రైజ్ స్కీం (పీడీపీఎస్) కింద కొనుగోలు చేసిన ఉల్లి ధరపై వ్యత్యాసం అమౌంట్ (ఉదా: వ్యాపారికి క్వింటా రూ.350కు కొనుగోలు చేస్తే మిలిగిన వ్యత్యాసం డబ్బులు రూ.950 ప్రభుత్వం ఇచ్చేలా) ప్రభుత్వం చెల్లిస్తుంది. ఏపీ మార్క్‌ఫెడ్ 69,390 క్వింటాళ్లు (6,939 మెట్రిక్ టన్నులు) కొనుగోలు చేసింది. రూ.8.12 కోట్లు, వ్యాపారులు పీడీపీఎస్ కింద 80,230 క్వింటాళ్లు (8,023 మెట్రిక్ టన్నులు) కొనుగోలు చేశారు. వ్యత్యాసం (డిఫరెంట్) అమౌంట్ రూ.7.06 కోట్లు కలిపి రూ.15.18 కోట్లు ఉల్లి రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ.2 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలో జమ చేశారు. పంట అమ్ముకొని 15-20 రోజులు గడిచినా ఉల్లి డబ్బులు రాకపోవడంతో పంట కోత, రవాణా ఖర్చులకు చేసిన అప్పులు కూడా చెల్లించలేక కష్టజీవులు కన్నీరు పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఉల్లి కొనుగోలు డబ్బులు చెల్లించడంతో పాటు ఇకపై కొనుగోలు చేసే ఉల్లికి అదే రోజు డబ్బులు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఉల్లి కొనుగోలు చేసిన డబ్బులే సకాలంలో ఇవ్వడం లేదు.. హెక్టారుకు రూ.50 వేలు సాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ డబ్బులు ఎప్పుడిస్తారో..? అని ప్రశ్నిస్తున్నారు.

మిగతా 8లో...



కర్నూలు మార్కెట్ యార్డులో అమ్మకానికి రైతులు తీసుకొచ్చిన ఉల్లి దిగుబడులు (ఫైల్)



ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలు (ఫైల్)

అన్ని సౌకర్యాలు కల్పించాం

- విజయవాడకు బయలుదేరిన డీఎస్సీ అభ్యర్థులు ● కలెక్టర్ సిరి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో నిర్వహించే సభకు వెళ్లేందుకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించామని కలెక్టర్ సిరి పేర్కొన్నారు. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యా ప్తంగా 2,805 మంది అభ్యర్థులను వారి సహాయకులతో బయలుదేరుతున్న 123 బస్సులను జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు విజయవాడలో గురువారం సీఎం నియామక పత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి బస్సుకు ఒక పోలీస్ ఎస్కార్ట్, బస్సులో మెడికల్ కిట్లు ఏర్పాటు చేశామన్నారు. డిపార్టుమెంటు నుంచి ముగ్గురు అధికారులను బస్సు ఇన్‌చార్జిలుగా నియమించామన్నారు. పది బస్సులకు ఒక నోడల్ ఆఫీసర్ పర్యవేక్షిస్తారన్నారు నరసరావుపేట, గుంటూరులో మహిళలకు 8, పురుషులకు 10 కేంద్రాలు ఏర్పాటుచేసినా 18 కేంద్రాల్లో రాత్రి బస ఉంటుందన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగించుకున్న అనంతరం యథావిధిగా కర్నూలుకు బస్సులు చేరుతాయన్నారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్ పాల్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



తరలివచ్చిన అభ్యర్థులు

జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ సిరి

అటవీశాఖలో అవినీతి!



- చాంద్‌బాషా వ్యవహారంలో ఆశ్చర్యపోయేలా అవకతవకలు
- ఇప్పటివరకు రూ.7.5కోట్ల వరకు నిధులు దారి మళ్లింపు?
- రేంజ్‌ల పరిధిలోనూ.. అక్రమాల ఊడలు

ఆత్మకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే సంచలనంగా మారిన అటవీశాఖ రిటైర్డు ఉద్యోగి చాంద్‌బాషా చేసిన అక్రమాలను పరిశీలిస్తే ఆశాఖలో అవినీతి హెచ్చుమీరినట్లు తెలుస్తోంది. ఈ అవకతవకల్లో కింది స్థాయి ఎఫ్‌బీఓల నుంచి ఐఎఫ్ఎస్ అధికారుల వరకు అడుగడుగున వారి పనితీరుపై అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. దీంతో ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణించిన అటవీశాఖ ఉన్నతాధికారులు ఈ ఏడాది మే 19న ఒక ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించారు. వీరు చేపట్టిన విచారణలో రూ.7.5కోట్ల వరకు అక్రమాలు వెలుగు చూసినట్లు తెలిసింది. అయితే వాటికి సంబంధించి పూర్తిస్థాయిలో ఆధారాలు లభించకుండా చాంద్‌బాషా ఎక్కడికక్కడ తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో విచారణ బృందం అధికారులు సైతం తలలు పట్టుకుని తాము పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయలేమంటూ చేతులెత్తేసినట్టు సమాచారం. ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలో అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్‌గా పని చేసి గత ఏడాది జూలై నెలలో పదవీవిరమణ పొందిన చాంద్‌బాషా చేసిన అక్రమాల్లో ప్రధానంగా చెక్‌పోస్టుల నుంచి వచ్చిన సొమ్మును ఆంధ్రప్రదేశ్ టైగర్ కన్జర్వేషన్ ఫండ్ (ఏపీటీసీఎఫ్), ఫారెస్టు డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎఫ్‌డీఏ) తదితర సంస్థలకు చెక్కులను ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసినప్పుడు మాత్రమే చేతివాటం ప్రదర్శించి ఆ చెక్కులను దారిమళ్లించినట్లు తొలుత అధికారులు గుర్తించారు. ఈ లెక్కన జూన్ 21వ తేది వరకు జరిగిన విచారణలో రూ.4.37కోట్ల వరకు నిధులు స్వాహా చేసినట్లు నిర్ధారించారు. ఆతర్వాత కూడా చేపట్టిన విచారణలో చాంద్‌బాషా అటవీశాఖలోని వివిధ పథకాలకు సంబంధించి నిధుల విషయంలో కూడా గోల్‌మాల్ జరిగి మరో రూ.3కోట్లకు పైగా అక్రమాలు వెలుగుచూసినట్లు తెలిసింది. కింది స్థాయి అటవీ సిబ్బంది మొదలుకుని కొందరు రేంజర్లను కూడా భాగస్వాముల్ని చేసి నిధులను దారిమళ్లించినట్లు సమాచారం. అటవీ శాఖ పరిపాలనలో పలు పథకాలను అమలు చేస్తుంటారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ కాంపన్సేటరీ ఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ (ఏపీసీఏఎంపీఏ) పథకం ద్వారా నిధులు మంజూరు చేస్తారు. అటవీ భూమి, పర్యావరణ వ్యవస్థ సేవలు నష్టపోయినట్లయితే పరిహారం ద్వారా అటవీకరణను పెంచడం, సహజ పునరుత్పత్తి సహాయంతో అడవుల నాణ్యతను మెరుగుపర్చడం, జీవ వైవిధ్యాన్ని సుసంపన్నం చేయడం, వన్యప్రాణుల అవాసాలను మెరుగుపర్చడం, అటవీ అగ్ని నియంత్రణ, అటవీ రక్షణ, నేల, నీటి సంరక్షణ కోసం ప్రతిఏటా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులను మంజూరు చేస్తారు. ఒక్క ఆత్మకూరు డివిజన్‌లోనే 48 వీఎస్ఎస్ కమిటీలను ఏర్పాటు చేసి వీటి ద్వారానే అడవుల్లో చెక్‌డ్యామ్ నిర్మాణ పనులు, నీటికుంటలు, పూడిక తీత పనులు, మొక్కలు నాటడం, అడవుల్లో విత్తనాలు చల్లించడం తదితర పనులను చేపడతారు. అయితే ఈ పథకాలకు సంబంధించి కేటాయించిన నిధుల వినియోగంలో కూడా చాంద్‌బాషా గోల్‌మాల్ చేసినట్లు తెలిసింది.

మిగతా 9లో

10 గేట్ల ద్వారా నీటి విడుదల

882 అడుగులుగా శ్రీశైలం డ్యాం నీటిమట్టం



శ్రీశైలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నీటిమట్టం బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882 అడుగులు గానూ, నీటినిల్వ సామర్థ్యం 199 టీఎంసీలుగానూ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా నీటినిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా ఉందన్నారు. రిజర్వాయర్‌కు ఎగువ జూరాల స్పిల్‌వే నుంచి 2,21,120 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తికి 27,927 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 17,784 క్యూసెక్కులు, హంద్రీ నుంచి 2000 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చి చేరాయి. ప్రాజెక్టు 10 క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 14 అడుగుల ఎత్తు మేరకు తెరిచి స్పిల్‌వే గుండా 3,45,730 క్యూసెక్కులు సాగర్‌కు విడుదల చేశారు. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 65,341 క్యూసెక్కులు విడుదల చేశారు.

కవులు, కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహమివ్వాలి

● అరుణభారతీ సంస్థ వ్యవస్థాపకులు బీసీ రాజారెడ్డి



యాగంటి పెయింటింగ్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ రాజారెడ్డి, చిత్రలేఖనం ఆర్టిస్ట్ లావణ్య

బనగానపల్లె, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కవులు, కళాకారులు, రచయితలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహం కల్పించాలని అరుణ భారతీ సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. లైవ్ పెయింటింగ్‌లో ప్రతిభ కనబరచిన ఆర్టిస్ట్ లావణ్యను బీసీ రాజారెడ్డి బుధవారం బనగానపల్లెలో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రం భువనగిరికి చెందిన లావణ్య లైవ్ పెయింటింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరచి అందరి ప్రశంసలు అందుకుంటోందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను, పుణ్యక్షేత్రాల ఆధ్యాత్మికత, ప్రకృతిలోని అందాలను చిత్రరూపంలో తెలియజేయాలనే ఉద్దేశంతో ఆమె పర్యటనలు చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటికి వచ్చిన లావణ్య క్షేత్రపరిధిలో సహజ సిద్ధంగా ఉన్న ఎర్రమల కొండలు, ఆలయ గోపురం, కోనేరు, ఉమామహేశ్వరస్వామి మూలవిరాట్, బసవేశ్వరస్వామి ఒకే చిత్రంలో కనిపించేలేలా కేవలం 4 గంటల్లోనే లైవ్ పెయింటింగ్ వేసి ఆశ్చర్యపరిచారన్నారు. ఈ కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రేడింగ్‌లో తీసేసిన ఉల్లినే పారబోశా..

● వీడియో తీసి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు

● పందికోన రైతు కడవలరాజు



గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లిని ట్రాక్టర్‌తో పారబోస్తున్న దృశ్యం

పత్తికొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లినే పారబోసినట్లు పందికోన గ్రామానికి చెందిన రైతు కడవల రాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లిని పారబోయగా దీన్ని వీడియో తీసి కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలకు వాడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న రెండెకరాల్లో ఉల్లి పంటను సాగుచేశానని, రెండు రోజుల క్రితం కోతకోసి గ్రేడింగ్ చేయగా 300 బస్తాలు (50 కిలోలు) దిగుబడి వచ్చిందన్నారు. దిగుబడి వచ్చిన ఉల్లిపంటను స్థానిక వ్యాపారులకు క్వింటం రూ700 అమ్ముకున్నానన్నారు. పొలంలో వేరేపంటను సాగుచేయాలన్న ఉద్దేశంతో గ్రేడింగ్‌లో అమ్మకానికి పనికిరాని ఉల్లిని బుధవారం ట్రాక్టర్ ద్వారా బయట పారబోశామన్నారు. ట్రాక్టర్ ద్వారా పారబోస్తున్న గ్రేడింగ్‌లో తీసివేసిన ఉల్లిని వీడియో తీసుకున్న కొందరు వైసీపీ కార్యకర్తలు ఆ వీడియోలను సోషల్ మీడియాలో పోస్టుచేసి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు వాడుకుంటున్నారన్నారు.

తెర వెనుక వైద్యుడు

● ఔషధ తయారీ నిపుణులు

● వైద్య రంగంలో కీలకం ఫార్మసిస్టులు

● నేడు వరల్డ్ ఫార్మసిస్టు డే



రోగులకు వైద్యం చేసేది డాక్టర్లు.. రోగుల సేవల్లో కీలకపాత్ర పోషించేది ఫార్మసిస్టులు. మందుల తయారీ నుంచి డాక్టర్ ప్రిస్క్రిప్షన్ అర్థం చేసుకునే వరకు ఫార్మసిస్టులు కీలకం. అందుకే వీరిని తెర వెనుక వైద్యులని అంటుంటారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్యుల తర్వాత ఫార్మసిస్టులు అత్యంత ముఖ్యమైన వారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్మసిస్టుల సేవలను గుర్తించడానికి సెప్టెంబరు 25న ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్ ఫెడరేషన్ వరల్డ్ ఫార్మసిస్టుల డేను నిర్వహిస్తుంది. ఈ ఏడాది 'ఆరోగ్యం గురించి ఆలోచించండి. ఫార్మసిస్టును గురించి ఆలోచించండి' అన్న నినాదాన్ని ఇచ్చింది. వరల్డ్ ఫార్మసిస్టుల డేను పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి' కథనం.

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పదికాలాల పాటు పదిలంగా ఉండాలంటే అందులో ఫార్మసిస్టుల పాత్ర కీలకం. మందులు నిత్యావసరాల జాబితాలో చేరిపోయాయి. బీపీ, షుగర్, గుండె, కిడ్నీ, లివర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి నుంచి స్వల్ప అనారోగ్యాలకు గురైన వారి వరకు మందులను వినియోగిస్తారు. ఔషధాలను రాసేది వైద్యుడే అయినా వాటిని మోతాదులో.. ఎలా వినియోగించేది రోగులకు వివరించేది ఫార్మసిస్టులే.

ఉమ్మడి జిల్లాలో 12వేల మంది

కర్నూలు, నంద్యాల జిల్లాలో 12వేల మంది ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఏపీ వైద్య విధాన పరిషత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, కర్నూలు జీజీహెచ్, ఏరియా ఆసుపత్రులు, రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు, 104 సెంటర్ డ్రగ్ స్టోర్‌లో ఫార్మసిస్టులుగా పని చేస్తున్నారు ఉమ్మడి జిల్లాలో 2,500 మెడికల్ షాపులు, హోల్‌సేల్ షాపులున్నాయి. వీటిని ఫార్మసిస్టులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు ఫార్మసి కాలేజీల నుంచి ఏటా 500 మంది ఫార్మసిస్టులు బయటకు వస్తున్నారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు

సాధారణంగా మెడికల్ షాపు బోర్డులపై కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అని రాసుకుంటారు. డాక్టర్ రాసే మందులు కాంబినేషన్లు అర్థం చేసుకునే వారు కనుక కెమిస్ట్ అని, మందుల గురించి అవగాహన కలిగిన వారు కాబట్టి డ్రగ్గిస్ట్ అంటారు.

ఇంటర్ బైపీసీ, ఎంపీసీ..

ఫార్మసిస్టు కావడానికి ఫార్మసీ కోర్సులను చేయాల్సి ఉంటుంది. ఇంటర్ బైపీసీ, ఎంపీసీ విద్యార్థుల మార్కుల ఆధారంగా ఫార్మసిస్టులు కేటాయిస్తారు. ఫార్మాసూటికల్ రంగంలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ప్రొడక్షన్ కెమిస్ట్, ఎనలైటికల్ కెమిస్ట్, రెగ్యులర్ ఎఫైర్స్, ఇంటలెక్చువల్స్‌గా సేవలందిస్తున్నారు. ఆసుపత్రుల్లో క్లినికల్, కన్సల్టెంట్, వెటర్నిటీ ఫార్మసిస్టులుగా సేవలందిస్తున్నారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, అకడమిక్ అండ్ రీసెర్చ్‌గా కమ్యూనిటీ ఫార్మాసిస్టు, మిలిటరీ ఫార్మాసిస్టు, హోల్‌సేల్ అండ్ రిటైల్ ఫార్మాసిస్టులుగా సేవలందిస్తున్నారు.

అనుభవం అవసరం



కొత్త ఫార్మసిస్టులు ముందుగా అనుభవం తెచ్చుకోవాలి. రోగిని ప్రిస్కిప్షన్ ప్రకారం మందులు ఎలా వేసుకోవాలో వివరించాలి. గతంతో పోలిస్తే కొత్తగా ఫార్మసిస్టు కోర్సు పూర్తి చేసిన వారు స్వంతంగా మందుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇలాంటి షాపులకు ఆన్‌లైన్‌లో త్వరగా అనుమతులిస్తున్నాం.

● ఏటీవీ రమాదేవి, అసిస్టెంట్ డైరెక్టర్, ఉమ్మడి జిల్లా ఔషధ నియంత్రణ శాఖ, కర్నూలు

ప్రజల ఆరోగ్యాన్ని..



ప్రజల ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైంది. వైద్యులు రాసిన మందులను అర్థం చేసుకుని సరైన వాటిని వ్యాధిగ్రస్తులకు ఇవ్వడం ఫార్మసిస్టులు చేస్తుంటారు. కర్నూలు నగరంలో 800 మెడికల్ షాపులున్నాయి. ఫార్మసిస్టులు మందులు ఎలా వాడాలో తెలిపి ఆరోగ్యాన్ని సంరక్షించడంలో తోడ్పడుతారు.

● పి.హనుమన్న, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, కర్నూలు అర్బన్

ఫార్మసిస్టులు లేకుండానే దుకాణాలు

ఉమ్మడి జిల్లాలో 3వేల మందుల షాపులున్నాయి. సాధారణంగా ఫార్మసిస్టులకే మందుల దుకాణాల నిర్వహణకు అనుమతి ఇస్తారు. చాలా వాటిలో ఫార్మసిస్టులే ఉండటం లేదు. కొందరైతే ఫార్మసిస్టుల ద్వారా దుకాణానికి అనుమతులు తీసుకుంటూ స్వంతంగా నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే సాధారణ ఆరోగ్య సమస్యలకు ఉపయోగించే మందులు కిరాణషాపుల్లోనూ విక్రయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొందరు ఆర్ఎంపీలు, ఫార్మసిస్టుల పాత్ర పోషిస్తూ వారిదగ్గరే మందులను ఉంచుకుని వైద్యసేవలందిస్తూ ప్రజలను తీవ్ర అనారోగ్యానికి గురి చేస్తున్నారు.

ఎప్పుడిస్తారో?

7వ పేజీ తరువాయి..

ఉమ్మడి జిల్లాలో 2018లో కూడా ఇలాగే ఉల్లి ధరలు భారీగా పతనమయ్యాయి. ఆనాటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం కనీసం మద్దతు ధర రూ.700 నిర్ణయించి ఉల్లి కొనుగోళ్లు చేపట్టింది. మార్కెట్ లైసెన్స్‌డ్ వ్యాపారులు కొనుగోలు ధరపై వ్యత్యాసం (డిఫరెంట్) అమౌంట్ బోనస్‌గా ఇస్తామని ప్రకటించింది. ఆ సంవత్సరంలో ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ఉల్లి సేకరించారు. తొలి విడతగా ఉల్లి బోనస్ అమౌంట్ రూ.25లక్షలకు పైగా రైతుల ఖాతాలో జమ చేశారు. కర్నూలు మార్కెట్లో ఆగస్టు నుంచి ఉల్లి అమ్మకాలు చేసిన రైతులు జాబితా సిద్ధం చేసి ఉల్లి బోనస్ రూ.6.25 కోట్లు చెల్లించాలని మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఆ నిధులు మంజూరు చేసే సమయంలో 2019 మార్చి 10న అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఉల్లి రైతులకు బోనస్ డబ్బులు విడుదల చేయలేదు. ఆ తరవాత వచ్చిన జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ రోజు వరకు ఆ డబ్బులు రాలేదు. నాటి బోనస్ డబ్బులు కూడా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అప్పులోళ్లకు ఏమని చెప్పాలి



రెండెకరాల్లో ఉల్లి సాగు చేశాను. ధరలు పతనం కావడంతో ఉల్లి పంట కోయాలా వద్దా..? అంటూ ఆలోచిస్తున్న సమయంలో ప్రభుత్వం క్వింటాకు రూ.1,200 మద్దతు ధర ప్రకటించి భరోసా కల్పించింది. కొంతైనా చేతికొస్తుందనే ఆశతో పంట కోత, రవాణాకు మరో రూ.35 వేలకు పైగా అప్పు చేసి పంటను కర్నూలు మార్కెట్‌కు తీసుకెళ్లాను. క్వింటా రూ.1,200 ప్రకారం 86 క్వింటాళ్లు తీసుకున్నారు. నాకు రూ.1,06,200 రావాలి. 20 రోజులు దాటినా ఉల్లి అమ్మిన డబ్బులు రాలేదు. అప్పులోళ్లకు ఏమని సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే డబ్బులు ఇవ్వాలి.

● వెంకటేశ్వర్లు, ఉల్లి రైతు, తిమ్మందొడ్డి గ్రామం, సి.బెళగల్ మండలం

వెంటనే ఉల్లి డబ్బులు ఇవ్వాలి



ఎకరన్నర పొలంలో ఉల్లి సాగు చేశా. ప్రభుత్వం క్వింటా రూ.1,200 కొనుగోలు చేస్తుందంటే కొంతలో కొంతైనా ఆర్థిక కష్టాలు తీరుతాయని మరో రూ.35 వేలు అప్పు చేసి పంట కోసి 52 క్వింటాళ్లు మార్కెట్‌కు తీసుకెళ్లాను. నాకు రూ.62,400 రావాలి. 20 రోజులైనా ఇవ్వడం లేదు. ఆర్థికంగా ఎన్నో కష్టాలు పడుతున్నాం. ప్రభుత్వం రైతుల కన్నీటి కష్టాలు చూసైనా వెంటనే డబ్బులు ఇచ్చి ఆదుకోవాలి. హెక్టారుకు రూ.50 వేలు ప్రకటించిన సాయం కూడా కాలయాపన చేయకుండా తక్షణమే మంజూరు చేయాలి.

● మునిస్వామి, ఉల్లి రైతు, పోలుకల్లు గ్రామం, సి.బెళగల్ మండలం

'మునిరాజ మహేశ్వరం' కథల సంపుటి ఆవిష్కరణ



కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లౌకికత్వాన్ని ప్రతిబింబించేదే 'మునిరాజ మహేశ్వరం' కథల సంపుటి అని పలువురు వక్తలు అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కథా రచయిత డాక్టర్ మనోహర్ కోటకొండ రాసిన 'మునిరాజ మహేశ్వరం' కథల సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కథల సంపుటిలోని కథలపై ప్రముఖ కవులు జి.వెంకటకృష్ణ, ఎస్ఎండీ ఇనాయతుల్లా, మారుతీ పౌరోహితం వక్తలుగా ప్రసంగించారు. కథల సంపుటి ఆవిష్కర్త రచయిత్రి డాక్టర్ సుభాషిణి మాట్లాడుతూ హిందూ ముస్లిం మైత్రి మత విద్వేషాల కాలంలో మూడు కథలు ప్రేమానుబంధాన్ని పెంచి లౌకికత్వాన్ని చాటే కథలుగా తెలుగు కథా సాహిత్యంలో ఆవిష్కరణ అయ్యాయని రచయితను అభినందించారు. సభాధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడుతూ కథలన్నీ కవితాత్మకంగా సాగుతాయని, కవి కథలు రాస్తే ఎలా ఉంటాయో అలా రాశారని చెప్పారు. రచయిత డాక్టర్ మనోహర్ కోటకొండ తన స్పందన తెలియజేస్తూ సాహిత్యం తన జీవితంలో ఒక భాగమైందని అన్నారు. ఇది సామాజిక మార్పు దిశగానే ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. సభలో వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు నాగేశ్వరాచారి, ఆవుల చక్రపాణి యాదవ్, విజయులు తనగల, ఆకెపోగు నాగరాజు, డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, చౌశా, సుల్తాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సహస్ర దీపాలంకరణ



సహస్రదీపాలంకరణ సేవలో పాల్గొన్న భక్తులు

మహానంది, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం ఆలయంలోని కామేశ్వరీదేవి ఆలయంలో యథావిధిగా ఋత్వికులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక యాగశాల మంటపంలో శరన్నవరాత్రి ఉభయదాతల చేత చండీ హోమంతో పాటు కుంకుమార్చన పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. సాయంత్రం 6 గంటల నుండి అలంకార మంటపంలో భక్తుల చేత సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. అనంతరం కామేశ్వరీదేవిని చంద్రఘంట దుర్గ అలంకారంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులతోపాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడాకారులకు సీఎం చంద్రబాబు ప్రోత్సాహం

● రాష్ట్రం నుంచి జాతీయస్థాయి పోటీలకు ఒక జట్టు ఎంపిక

● ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్‌రావు

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సహకారంతో అండర్ 19 ఫుట్‌బాల్ పోటీలు



మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్ రావు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు సీఎం చంద్రబాబు ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని ఎస్‌జీఎఫ్ స్టేట్ అబ్జర్వర్ ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరులో జరుగుతున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఒక మంచి జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఉమ్మడి 13 జిల్లాలనుంచి 520మంది బాలబాలికలు హాజరయ్యారన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన బాలికలు, బాలుర జట్లనుంచి ఒక మంచి టీం ను ఎంపిక చేసేందుకు సీనియర్ పీడీలను నియమించామన్నారు. వీరు పరిశీలించి జాతీయ స్థాయి పోటీలకు ఒక టీంను ఎంపిక చేస్తారని తెలిపారు. అక్టోబరు 5న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో మనరాష్ట్రం నుంచి ఎంపికైన జట్లు పాల్గొంటాయన్నారు. బాలబాలికలకు ఎమ్మిగనూరు, నందవరంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్నిఏర్పాట్లు చేశారన్నారు. స్థానికంగా బీవీ ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. బీవీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ నాయుడు, టీడీపీ నాయకులు కమ్మ మహేంద్ర, బగిడే నాగరాజు, కామర్తి మహేష్, పీఈటీలు రామాంజనేయులు, శ్రీనివాసులు, హనీఫ్, శ్రీరామ్, నరసింహరాజులు తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో బాలురు, నందవరం జడ్పీ హైస్కూల్ మైదానంలో బాలికల జట్ల మధ్య ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బాలుర జట్లలో ఫస్ట్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయనగరం, విశాఖపట్నం జట్ల మధ్య జరగగా 2-1 తేడాతో విశాఖపట్నం విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. రెండో క్వార్టర్ ఫైనల్‌లో శ్రీకాకుళం, నెల్లూర్ జట్లు తలపడగా నెల్లూరుజట్టుపై పెనాల్టీ షూటౌట్‌లో శ్రీకాకుళం జట్టు 6-5స్కోరు తేడాతో విజయం సాధించింది. మూడో క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో కర్నూలు, గుంటూరు జట్లు తలపడగా కర్నూలు జట్టు 3-0 స్కోర్‌తో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. నందవరం జడ్పీ హైస్కూల్ మైదానంలో జరిగిన బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో పశ్చిమ గోదావరి- శ్రీకాకుళం, అనంతపురం- గుంటూరు, కర్నూలు-చిత్తూరు, విశాఖపట్నం-కృష్ణ జట్లు తలపడ్డాయి. ఉత్తమ ప్రతిభకనబరచిన పశ్చిమగోదావరి, అనంతపురం, కర్నూలు, విశాఖపట్నం జట్లు విజయం సాధించాయి.



నంద్యాలలో కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



మద్దిలేటి స్వామి క్షేత్రంలో బాలత్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు



కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు



ఆదోనిలో రాజ్మా సోయాబీన్స్‌తో అవ్వ అలంకారం



కర్నూలు గీతామందిరంలో నారాయణి అలంకరణలో అమ్మవారు



బ్రహ్మచారిణి అలంకారంలో చౌడేశ్వరీమాత

బనగానపల్లె: నందవరం గ్రామంలో కొలువైన చౌడేశ్వరీమాత ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం చంద్రఘట అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి, పీవీ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణగా అమ్మవారు



ధైర్యలక్ష్మి అంకరణలో గోదాగోకులంలోని అమ్మవారు

కర్నూలు కల్చరల్ / గూడూరు/ ఆదోని టౌన్/ బేతంచెర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాలు కర్నూలు నగరంలో సందడి చేస్తున్నాయి. మూడో రోజు బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వామహస్తంలో రసాన్న పాత్ర ధరించి ఆదిభిక్షువుగా యాచించవచ్చిన లయకారకుడైన విశ్వేశ్వరునికి భోజనం ప్రదానం చేస్తున్నట్లు దేవిని అలంకరిస్తారు. నగరంలోని వన్‌టౌన్ లోగల గీతామందిరంలో అమ్మవారు నారాయణి అలంకరణలో దర్శనమిచ్చారు. మించిన్ బజార్‌లోని పెద్ద అమ్మవారి శాలలో వాసవీదేవి అమ్మవారికి రాజ్యమాల దేవి అలంకరణ చేశారు. నగరంలోని పూలబజార్ సమీపంలోగల చిన్న అమ్మవారిశాల, వన్‌టౌన్‌లోని చిత్తారివీధిలోగల నిమిషాంబ, వన్‌టౌన్ కాళికాంబ, కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు. మామిదాలపాడులోగల శ్రీగోదాగోకుల క్షేత్రంలో అమ్మవారికి ధైర్యలక్ష్మిగా కనిపించారు.

● గూడూరు మండలం కె.నాగలాపురం సుంకులా పరమేశ్వరీ దేవి అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి కుంకుమార్చన, మంగళహారతి, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏర్పాట్లను ఈఓ రాధాకృష్ణ గ్రామపెద్దలు గోపాల్‌రెడ్డి, సురేష్, సిబ్బంది కేశవ పర్యవేక్షించారు.

● ఆదోని పట్టణంలోని లక్ష్మమ్మ అవ్వ దేవాలయంలో బుధవారం రాజ్మా, సోయాబీన్స్‌తో చేసిన అలంకారంలో అవ్వ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.

● బేతంచెర్ల మద్దిలేటి స్వామి క్షేత్రంలో వెలసిన మహాలక్ష్మి అమ్మవారు బుధవారం బాలత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అహోబిల నృసింహుడికి ప్రత్యేక పూజలు



స్వామి,అమ్మవార్లకు పూజలు

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ ఆధ్వర్యంలో నరసింహస్వామికి ప్రత్యేక పూజలు, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన నృసింహుడిని అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన నాగ ఉదయ్ కుమార్ కుటుంబ సభ్యులు ఉత్సవానికి ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు.

అటవీశాఖలో అవినీతి..!

(7వ పేజీ తరువాయి)

నిధుల గోల్‌మాల్ ఇలా..

అడవులు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా భారత ప్రభుత్వం ప్రతి ఏటా ఆయా పథకాల నిధులను సర్కిళ్లకు కేటాయించడం జరుగుతోంది. ఇందులో భాగంగా నాగార్జున సాగర్ - శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యానికి సంబంధించి ఆ పథకాల నిధులు చేరవేయబడతాయి.



విచారణ చేస్తున్న అధికారులు

ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 330 మంది ప్రొటెక్షన్‌వాచర్లు, డ్రైవర్లుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా తదితర ఔట్‌సోర్సింగ్ విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరికి జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ తదితర అలవెన్స్‌లతో కలిసి ప్రతినెల రూ.50 లక్షల వరకు ఖర్చవుతోంది. అదేక్రమంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం ఆయా నెలల అవసరాలను బట్టి నిధుల వినియోగం ఉంటుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ బిల్లులు సకాలంలో అందని కారణంగా ఆయా పథకాల ద్వారా సర్కిల్ ఆఫీసు వారు డివిజన్ కార్యాలయాలకు అప్పుగా సొమ్మును ఇవ్వడం జరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే సర్కిల్ కార్యాలయం నుంచి ఆయా పథకాల (ఏపీసీఏఎంపీఏ, బయో శాప్, వీఎస్ఎస్) అమలు కోసం ఖర్చు చేసిన నిధుల తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ వ్యవహారంలో కూడా చాంద్‌బాషా గోల్‌మాల్ చేసినట్లు విచారణ బృందం దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో సర్కిల్ ఆఫీసు నుంచే వచ్చే సొమ్మును రేంజ్‌లకు చెల్లించడంలోనూ, రీఫండ్‌లోనూ చేతివాటం ప్రదర్శినట్లు సమాచారం. ఆయా పథకాల ద్వారా చేయని పనులకు, నాణ్యత లేని మొక్కుబడి పనులకు కూడా బిల్లులు తయారు చేసి ఇందులో రేంజర్లకు, కింది స్థాయి సిబ్బందికి వాటాలు ఇచ్చి నిధులు కాజేసినట్లు ఆరోపణలున్నాయి. అయితే ఆయా పనులను ఉన్నతాధికారులు పరిశీలించిన దాఖలాలు కూడా లేవని తెలిసింది. అదేక్రమంలో సర్కిల్ ఆఫీసుకు రీఫండ్ చేసే క్రమంలో కూడా చెక్కులను దారిమళ్లించినట్లు సమాచారం. అయితే ఎస్ఎస్‌టీఆర్ సర్కిల్ ఆఫీసు వారు కూడా నిధుల మంజూరు తర్వాత రీఫండ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చాంద్‌బాషా దర్జాగా అక్రమాలు సాగినట్లు ప్రచారం జరుగుతోంది.

ఆధారాలను సేకరణలో తలమునకలు

చాంద్‌బాషా చేసిన అక్రమాలను గుర్తించేందుకు విచారణ బృందం సైతం తలమునకలైనట్లు తెలుస్తోంది. అటవీ చెక్‌పోస్టుల అక్రమాలను సులువుగానే గుర్తించినప్పటికీ ఆయా పథకాల అక్రమాల ఆధారాలను పూర్తిస్థాయిలో గుర్తించడం కష్టతరంగా మారింది. ఇప్పటికే ఆత్మకూరు అటవీ డివిజన్ వారు బ్యాంకు లావాదేవీలు జరిపే యూనియన్ బ్యాంక్ ఆత్మకూరు బ్రాంచ్ నుంచి పలు ఆధారాలను సేకరించారు. మరిన్ని చెక్కులు, నెఫ్ట్‌ఫారాలు, ఇతర పత్రాల కోసం తిరుపతి రీజనల్ ఆఫీసు వారిని సంప్రదించినట్లు తెలిసింది. దీంతో అధికారులకు ఈ సమస్య మరింత జఠిలమైంది. అయితే చాంద్‌బాషా అవినీతి అక్రమాలు తవ్వే కొద్ది బయటపడుతుండటంతో ఏమి చేయాలో దిక్కుతోచక విచారణ బృందం తలలు పట్టుకున్నట్లు తెలిసింది. తమ రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తూ.. ఈ విచారణ చేయడం సాధ్యం కావడం లేదని అప్పటివరకు తయారు చేసిన నివేదికలను ఈ నెల 16వ తేదీన పీసీసీఎఫ్ వీ.చలపతిరావుకు అందజేశారు.

రికవరీ ఎలా?

చాంద్‌బాషా అక్రమాల వ్యవహారం అటవీశాఖకే పెనుసవాల్‌గా మారింది. అసలు ఈ సమస్యకు పరిష్కారం ఏమిటన్నది కూడా ఆ శాఖ అధికారులకు అంతుచిక్కడం లేదు. పథకాల అమల్లో చాలా మంది అటవీ సిబ్బంది, ఉద్యోగులను ఇందులో భాగస్వాములు కావడం గందరగోళానికి దారితీస్తోంది. అదేక్రమంలో చాంద్‌బాషా స్వాహా చేసి సొమ్మును ఏవిధంగా రికవరీ చేయాలన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఇదిలావుంటే ప్రస్తుతం చాంద్‌బాషా రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయన్ను ఈ నెల 17 నుంచి 21 వరకు ఆత్మకూరు పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అయితే ఆయన విచారణకు పూర్తిస్థాయిలో సహకరించలేదని తెలిసింది. ఏదిఏమైనా.. చాంద్‌బాషా వ్యవహారంతో అటవీశాఖకు కనువిప్పు కలిగిందని చెప్పవచ్చు. ఇలాంటి అక్రమాలకు భవిష్యత్ తావు లేకుండా అటవీశాఖలో పకడ్బందీ చర్యలకు ఆశాఖ అధికారులు శ్రీకారం చుడుతున్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గడివేముల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరటమద్ది గ్రామానికి చెందిన బాలవెంగమ్మ (60) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు బాలవెంగమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 14న పురుగుల మందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకోకపోవడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

హాలహర్వి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్కూటర్ అదుపు తప్పి బోల్తాపడిన ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. బంధువులు తెలిపిన వివరాలు.. హాలహర్వికి చెందిన లక్ష్మి, మల్లికార్జున బైక్‌పై ఆలూరుకు వెళ్తున్నారు. బుధవారం బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మి మృతిచెందింది. మల్లికార్జునకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆస్పత్రికి తరలించినట్లు బంధువులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-దూపాడు రైల్వేస్టేషన్ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వేపోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు వయసు 35 ఏళ్లు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి శరీరంపై లేత నీలం రంగు షర్టు, బూడిద కలర్ పారాగాన్ చెప్పులు ఉన్నాయి. ముదురు నీలం రంగు డ్రాయర్, జోష్ డిక్సెనీ స్కాట్ అక్షరాలు ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురీకి తరలించారు. ఆచూకి తెలిసిన వారు సీఐ శ్రీనాథ్ రెడ్డిని 9908889696 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పురుగుమందు తాగి యువకుడు..

రుద్రవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని పెద్దకంబలూరులో బుధవారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ మహ్మద్‌రఫీ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన అబ్దుల్లా (26) అనే యువకుడు మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించేందుకు స్థానికులు సహకరించలేదు. దీంతో ఎస్ఐ, మరో కానిస్టేబుల్ శవాన్ని వాహనంలో చేర్చారు. నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి బంధువులకు మృతదేహానికి అప్పగించారు. మృతుడి తల్లి మహ్మద్‌బీబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రావెల్ బస్సుకు జరిమానా

డోన్ రూరల్/క్రిష్ణగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అమకతాడు టోల్ ప్లాజా వద్ద బుధవారం తెల్లవారుజామున ఆర్టీవో అధికారులు తనిఖీలు చేశారు. రోడ్ ట్యాక్స్ కట్టకుండా తిరుగుతున్న ట్రావెల్ బస్సుకు బారీ జరిమానా విధించారు. బెంగుళూరు నుంచి తెలంగాణ రాష్ట్రంలోని పల్వంచకు వెళ్తున్న ట్రావెల్ బస్సును తనిఖీచేసి రోడ్‌ట్యాక్స్ కట్టనందుకు రూ.3.73లక్షలు జరిమానా విధించామని డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో నంద్యాల అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రరావు పాల్గొన్నారు.



తనిఖీ చేస్తున్న ఆర్టీవో అధికారులు

వేతనాలొచ్చేనా..!

- సమగ్రశిక్ష ఉద్యోగుల ఎదురుచూపులు
- పండుగ పూట పస్తులేనా?
- బడ్జెట్ వస్తేనే వేతనాలంటున్న అధికారులు
- కూటమి ప్రభుత్వంలోనూ తప్పని కష్టాలు



ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు(ఫైల్)

ప్రభుత్వాలు మారినా సమగ్రశిక్ష ఉద్యోగుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీ రాగానే వేతనాలు అందుతున్నాయి. సమగ్ర శిక్ష ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు మాత్రం బడ్జెట్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. సెప్టెంబరు నెల ముగియడానికి వచ్చినా ఇంతవరకు వేతనాలు అందలేదు. ఇంటి అద్దెలు, పిల్లల పోషణ భారంగా మారుతుందని వాపోతున్నారు.

ఆలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో పనిచేసే ఉద్యోగులు వేతనాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి ప్రభుత్వ శాఖలో విధులు నిర్వహించే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు వార్షిక బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తుంది. సంబంధిత శాఖల హెచ్‌వోడీల ద్వారా కాంట్రాక్ట్ ఉద్యోగులకు నేరుగా వేతనాలు జమచేస్తూ ఔట్ సోరిసంగ్ ఉద్యోగు లకు ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్ (ఆప్కాస్) ద్వారా వేతనాలు ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు జమ అవుతున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 550మందికి పైగా..

కర్నూలు జిల్లాలో ఆశాఖ పరిధిలో ఉన్న కేజీబీవీల్లో సీఆర్టీలు, నాన్ టీచింగ్ సిబ్బంది, ఎంఆర్‌సీలలో ఆర్పీలు, మెసెంజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అకౌం టెంట్లు, మోడల్ హాస్టల్ వార్డెన్లు, పార్ట్ టైం ట్యూటర్లు, వంట చేసేవారు, వాచ్ మెన్‌లు, మెసెంజర్లు, అకౌంటెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, భవిత భవన్‌లలో ఎంఈఎస్ ఆర్డినేటర్లు, సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది ఇలామొత్తం 550 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కేంద్రం 60శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం కలిపి నిధులు కేటాయిస్తారు. ఒకటో తేదీ వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాట య్యాక సక్రమంగా వేతనాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు అవే కష్టాలు తప్పడం లేదంటున్నారు. చిరుద్యోగుల వార్షిక బడ్జెట్‌ను విడుదల చేసి ప్రతి నెలా సక్రమంగా వేతనాలు అందేలా చూడాలని కోరుతున్నారు.

వార్షిక బడ్జెట్ విడుదల చేయాలి



సమగ్రశిక్ష పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన వేతనాలు చెల్లించేందుకు వార్షిక బడ్జెట్‌ను విడుదల చేయాలి. దసరా పండగ కావడంతో వేతనాలు లేక చిరుద్యోగులు ఇబ్బందులు పడు తున్నారు. ప్రభుత్వం దృష్టిసారించి న్యాయం చేయాలి.

● మహమ్మద్‌రఫీ, సమగ్రశిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ స్టేట్ కో చైర్మన్

బడ్జెట్ వచ్చాకే వేతనాలు



సమగ్రశిక్ష నుంచి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆగస్టు నెలకు సంబంధించిన వేతనాల బడ్జెట్ విడుదల కాలేదు. అందుకే ఆలస్యమవుతుంది. ఉన్నతాధికారులకు కూడా వేతనాల కోసం విన్నవించాం. బడ్జెట్ రాగానే వేతనాలు జమ చేస్తాం.

● శామ్యూల్‌పాల్, డీఈవో, కర్నూలు

పొలాల్లో గంజాయి సాగుపై నిఘా పెట్టాలి

- కలెక్టర్ డాక్టర్ సిరి
- 250 పాఠశాలల్లో ఈగల్ టీమ్‌ల ఏర్పాటు : ఎస్పీ విక్రాంత్ పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో గంజాయి సాగుపై అధికారులు నిఘా పెట్టాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎన్కార్డు సమావేశం నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాలుతూ ప్రజలు, పాఠశాలలు, కాలేజీ విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తే వాటి వినియోగం, రవాణాను అరికట్టడం సాధ్యమన్నారు. రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న డిగ్రీ కాలేజీలలో సోమవారంలోపు ఈగల్‌టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ సిబ్బంది బస్సుల్లో ప్రయాణీకులత పార్సిల్స్‌ను జాగ్రత్తగా గమనించాలని, కొరియర్ సర్వీసుల విషయంలోనూ జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 250 పాఠశాలల్లో ఈగల్ టీమ్‌ల ఏర్పాటు చేశామన్నారు. పెద్దతుంబళం గ్రామంలో గంజాయిని అంతర పంటగా సాగు చేస్తుండగా గుర్తించి 3.5కేజీల గంజాయిని స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. మత్తు పదార్థాలను రవాణా చేస్తే ఎన్‌డీపీఎస్-47 చట్టం కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జడ్పీ సీఈవో నాసరరెడ్డి, కర్నూలు మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, ఈడీ మైనారిటీస్ సబీహా పర్వీన్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కేసు

ఇసుకను అక్రమంగా తరలించేవారిపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ డా.ఏ.సిరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ రవాణాను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. సమావేశంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మైనింగ్ అధికారి రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి కోసం పాట్లు



రైలు పట్టాలపై శవాన్ని తీసుకెళ్తున్న గణేకల్లు గ్రామస్థులు

ఆ గ్రామంలో శ్మశాన ఆఖరి(అంత్యక్రియలు) కార్యక్రమం చేపట్టడానికి కూడా పాట్లు తప్పడం లేదు. ఆదోని మండలం గణేకల్లులో శ్మశాన వాటికకు దారిలేదు. ఆ గ్రామంలో మరణించిన వారిని శ్మశాన వాటికకు తీసుకెళ్లాలంటే ప్రాణాలు తెగించి పాడి మోసుకొని రైలు పట్టాలను దాటాల్సిందే. ఈ క్రమంలో పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఇటు ప్రజా ప్రతినిధులు, అటు అధికారులు కానీ ఈ సమస్యను పట్టించుకోవడం లేదు. బుధవారం గ్రామానికి చెందిన మేస్త్రీ పెద్ద లక్ష్మయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. అంత్యక్రియల కోసం శ్మశాన వాటికకు తీసుకెళ్లడా నికి కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. మార్గమధ్యలో రైలు పట్టాలు దాటేందుకు ఇబ్బందులు పడ్డారు.

● ఆదోని రూరల్, ఆంధ్రజ్యోతి

న్యాయ సేవాధికార సంస్థలో గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది బుధవారం గ్రంథాలయాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ మెల్విన్ జోన్ తరుపున డా.రాయపాటి శ్రీనివాసులు పుస్తకాలను అందజేశారు. ఈ పుస్తకాలను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది చేతుల మీదుగా డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, సులోచనకు అందజేశారు.

రెండు డెంగీ కేసులు నమోదు

ఎమ్మిగనూరు రూరల్/ గోనెగండ్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గ పరిధిలోని గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాల్లో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. మండల కేంద్రమైన గోనెగండ్ల సచివాల యం 2లో బుధవారం ఓ డెంగీ కేసు నమోదు కాగా డెంగ్యూ కేసు నమోదు అయ్యింది. రోగి ఇంటి పరిసరాల్లో దోమలు, ఈగలు రాకుండా ఉండేందుకు గాను దోమల నివారణ మందును పిచికారి పంచాయతీ సిబ్బంది చేశారు. ఎమ్మిగనూరు మండలంలోని వెంకటగిరికి చెందిన బోయ మధు, మహాలక్ష్మిల ఐదేళ్ల కుమారుడు చాణక్య కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రక్త పరీక్షలు చేయించగా డెంగీ వచ్చినట్లు నిర్ధారణ అయ్యింది. రక్తకనాలు తగ్గడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు లీగల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉద్యోగానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెంది ఉండి, పది సంవత్సరాల ప్రాక్టీసు అనుభవం ఉన్న న్యాయవాదులు ఈ పోస్టుకు అర్హులన్నారు. క్రిమినల్ కేసులలో ప్రాక్టీసు ఉన్న న్యాయవాదులకు ప్రాధాన్యమిస్తున్నామనీ ఆయన తెలిపారు. దరఖాస్తు ఫారంను జిల్లా కోర్టు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 26వ తేదీలోపు చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు జిల్లా కోర్టుకు పంపుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌చార్జి డీఐజీగా పి.విజయలక్ష్మి

కల్లూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్టాంపులు రిజిస్ట్రేషన్‌శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ఇన్‌చార్జి డీఐజీగా పి. విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను ప్రభుత్వం ఇక్కడకు నియమించింది. ఇక్కడ పనిచేసిన పీజీఎస్.కళ్యాణి విశాఖపట్నం టూరిజం శాఖకు డిప్యుటేన్‌పై బదిలీ కావడంతో ఆమె బుధవారం రిలీవ్ అయినట్లు ఉద్యోగులు తెలిపారు.

మిద్దె కూలింది.. ప్రమాదం తప్పింది

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాదవాడలో గ్రామంలో బుధవారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు శేఖర్‌కు చెందిన మట్టి మిద్దె కూలింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూలడంతో పెను ప్రమాదం తప్పింది. శేఖర్ కుటుంబ సభ్యులు వారి బంధువుల ఇంటికి వెళ్లడంతో మిద్దె కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరని, కట్టుబట్టలతో మిగిలామని బాధితుడు వాపోయాడు. విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

దొంగతో కలిసి కానిస్టేబుల్ ప్లానింగ్

- రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లలో చోరీలు
- అనుమానం రాకుండా భార్య ద్వారా చోరీ సొత్తు విక్రయం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అసలు పోలీసులకు ఏమైంది.. మొన్నటికి మొన్న కోడుమూరులో పనిచేసే ఓ కానిస్టేబుల్ పలు కేసుల్లో సీజ్ చేసిన బైకులను అమ్మేసుకున్నాడు. ఇప్పుడు మరో పోలీసు దొంగతో జతచేరి చోరీలకు పాల్పడ్డాడు. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడు నెలల తర్వాత ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈచోరీ కేసులో అసలు దొంగ కానిస్టేబులే అని గుర్తించి విస్తుపోయారు. ఆ దొంగతో పాటు కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుని కొంత సొత్తును రికవరీ చేశారు. సీఐ విక్రమసింహ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని కల్లూరులో తెలుగు వీధిలో కారు డ్రైవర్‌గా పనిచేసే గురుస్వామి అనే వ్యక్తి ఇంట్లో ఈ ఏడాది ఫిబ్రవరి 19న చోరీ జరిగింది. పట్టపగలే చోరీ జరగ్గా సుమారు 11తులాల బంగారు ఆభర ణాలు, కొంత నగదు చోరీ జరిగింది. అదేరోజు సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పింగర్ ప్రింట్స్ సేకరించినా కేసు నమోదు చేయలేదు. ఆ తర్వాత బాధితుడు పలుసార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సబ్ జైలు నుంచి విడుదలైన నిందితుల వివరాలు సేకరించి వారి సెల్‌ఫోన్లు, సాంకేతిక పరిజ్ఞానంతో ఆరా తీయగా గుడివాడకు చెందిన జగదీశ్ అనే నిందితుని కదలికలు ఈ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించారు. అతని అదుపులోకి తీసుకుని విచారిస్తే గుట్టు రట్టయింది.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్నారు. ఈక్రమంలో గురుస్వామి చెందిన ఇళ్లను తాళం వేసినట్లుగా గుర్తించాడు. వెంటనే జగదీష్ ఆఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు నగదు చోరీచేశాడు. ఆ సొత్తును కానిస్టేబుల్ కృపానందంకు ఇచ్చాడు. ఎవరికి అనుమానం రాకుండా తన భార్య ద్వారా చోరీ సొత్తును విక్రయించేవాడని పోలీసుల విచారణలో తేలింది. కానిస్టేబుల్ గత ఆగస్టులో ఓ దొంగతనం కేసులోనే ప్రకాశం జిల్లా కంభం పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. అప్పటినుంచి ఆయన సస్పెన్షన్‌లో ఉన్నాడు. నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి 6 తులాల బంగారు నగలు రికవరీ చేసినట్లు సీఐ తెలిపారు. కృపానందం వాడిన పల్సర్ బైక్‌ను కూడా సీజ్‌చేశారు. కేసు ఛేదిం చడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ షాకీర్, కానిస్టేబుళ్లు ఎల్లా శివుడు, సుబ్బరాయుడును ఉన్నతాధికారులు అభినందించారు.

దొంగతో కానిస్టేబుల్ చట్టాపట్టాలు

కర్నూలు రెండో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కృపానందం ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సమయంలో పలువురు నిందితులకు ఎస్కార్ట్‌గా వెళ్లేవారు. ఈక్రమంలో కృష్ణాజిల్లా గుడివాడ సితారా సెంటర్‌కు చెందిన జగదీష్ అనే దొంగతో పరిచ యం ఏర్పడింది. ఈ క్రమంలో దొంగతనాలు ఎలా చేయాలో.. ఎలా చేసేవారో అతని ద్వారా తెలుసుకు న్నాడు. జగదీష్ బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత పలు సార్లు అతనితో కలిసి ఎన్నో ప్రణాళికలు రూపొందించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జగదీష్‌ను కర్నూలుకు పిలిపించాడు. తన పల్సర్ బైక్‌పై ఎక్కిం చుకుని పలు కాలనీల్లో మూడు, నాలుగు రోజుల పాటు రెక్కీ నిర్వహించాడు.

జగన్మాతా.. పాహిమాం..

● నగరంలో కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ గీతామందిరంలో అమ్మవారికి శ్రీనారాయణి అలంకరణ చేశారు. మించిన్ బజార్‌లోని పెద్ద అమ్మవారిశాలలో వాసవీదేవి అమ్మవారికి రాజ్యమాల దేవి అలంకరణ చేశారు. నగరంలోని పూలబజార్ సమీపంలోగల చిన్న అమ్మవారిశాలలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు వాసవి మాత విగ్రహానికి పూజలు, హోమాలు చేశారు. వన్‌టౌన్ చిత్తారివీధి నిమిషాంబ ఆలయం, కాళికాంబ ఆలయంలో భక్తులు పూజలు చేశారు సప్తగిరినగర్ య్యప్పస్వామి ఆలయం ఆవరణలో చౌడేశ్వరి మాతా గుడిలో మూడో రోజు పూజలు చేశారు. కల్లూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో, జమ్మిచెట్టు వీధిలోని లలితా పీఠంలో సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మామిదాలపాడు గోదాగోకుల క్షేత్రంలో రాత్రి అమ్మవారికి ధైర్యలక్ష్మి అలకంరణ చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజు గుప్త, ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.



నగరంలో కోలాటం



లలితాపీఠంలో చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



సుబేదారి వీధిలోని మంటపం వద్ద అన్నపూర్ణ దేవి

ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలి

● శాసనసభలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అభివృద్ధికి ప్రభుత్వం పహకరించాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. బుధవారం ఆమె అసెంబ్లీలో పెండింగ్ పనుల పూర్తికి సహకారం అందించాలని సీఎం చంద్రబాబు, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కోరారు. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం ఐపీడీ కింద రూ.500 కోట్లు విడుదలచేసి 22శాతం పనులు మాత్రమే పూర్తి చేసిందని, బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ పనులను ఆపేశారన్నారు. రూ.200 కోట్ల నిధులు కేటాయిస్తే మిగిలిపోయిన పనులు పూర్తవుతాయని, తద్వారా 668 బెడ్ల రోగులకు అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే క్రిటికల్ కేర్ బ్లాక్‌లో 80శాతం పనులు చేశారని, మరో రూ.20కోట్లు కేటాయిస్తే పూర్తయి, 50 పడకలు అందుబాటులోకి వస్తాయని వవరించారు.

సెక్యూరిటీ గార్డులకు నూతన యూనిఫాం

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సెక్యూరిటీ గార్డులకు నూతన యూనిఫాం అమలులోకి వచ్చింది. ఇటీవల ప్రభుత్వం ఆసుపత్రి భద్రతను ఈగల్ హంటర్ సెక్యూరిటీ ఏజెన్సీకి అప్పగించింది. బుధవారం సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు అడ్మినిస్ట్రేటర్ సింధు నూతన యూనిఫాంను పంపిణీ చేశారు. ఆసుపత్రిలో 150 మంది సెక్యూరిటీ గార్డులు ఉన్నారన్నారు. భద్రతను కట్టుదిట్టం చేయాలని ఏజెన్సీ ఏరియా మేనేజర్ కేజే రెడ్డిని ఆదేశించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

విజేతలకు ప్రశంసాపత్రాలు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన యూత్ ఫీస్ట్ మారథాన్ విజేతలకు కలెక్టర్ డా.ఏ.సిరి బహుమతులు ప్రధానం చేశారు. వైద్యఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ, క్రీడాశాఖ, ఇంటర్ విద్యాశాఖ నిర్వహించాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజేతలుగా రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ, లెప్రసీ, ఎయిడ్స్, టీబీ ఆఫీసర్ డా.ఎల్.భాస్కర్, ప్రోగ్రాం మేనేజర్ అలిహైదర్ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ఓర్వకల్లు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని హుశేనాపురం గ్రామంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో, సతీమణి జ్యోతి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పురోహితులు జంధ్యాల మనోహర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 24, (ఆంధ్రజ్యోతి): పొలంలో పత్తి, కంది మొక్కల చాటున గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఏవో రవిప్రకాష్‌గౌడ్ హెచ్చరించారు. మండలంలోని ముడుమలగుర్తిలో బుధవారం 'పొలంపిలుస్తోంది' నిర్వహించారు. పంట నమోదు చేయించుకోవాలని, సూక్ష్మ పోషకాల వాడకం పెంచాలని తెలిపారు.

కలెక్టర్‌కు వైద్యుల సమ్మె నోటీసు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26లోపు తమ డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మె చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు. బుధవారం ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి డా.విజయభాస్కర్ ఉపాధ్యక్షురాలు డా.రేఖ కోశాధికారి డా.రంగరవళి నేతృత్వంలో బుధవారం సాయంత్రం సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇన్ సర్వీసు పీజీ కోటాను పునరుద్ధరించాలన్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్న ప్రభుత్వ వైద్యులకు పదోన్నతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫిర్యాదులపై కలెక్టర్ సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ ఫిర్యాదులపై సంతృప్తి స్థాయి పెరగాలని కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పీజీఆర్ఎస్‌కు సంబంధించి 1100 కాల్ సెంటర్ ద్వారా ప్రజల నుంచి తీసుకుంటున్న ఫీడ్ బ్యాక్ అంశంపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం చేయాలన్నారు.

హాస్టల్ విద్యార్థులు ఇబ్బంది పడకూడదు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టల్ విద్యార్థులు ఇబ్బంది పడకూడదని ఎంపీ బస్తిపాటి నాగరాజు సూచించారు. బుధవారం కార్యాలయంలో బీసీ సంక్షేమాధికారులు, వార్డెన్లతో సమీక్షించారు. ఎంపీ నిధులతో చేసిన అభివృద్ధి పనులను తెలుసుకున్నారు. హస్టళ్లలో మరుగుదొడ్లు, కాంపౌండ్ వాల్స్, షెడ్ల నిర్మాణాలను వార్డెన్లు వివరించారు. ఎంపీ మాట్లాడుతూ నిధుల వినియోగంలో అవకతవకలు రాకుండా చూడాలని, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి ప్రసూన, కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, వసతి గృహాల వార్డెన్లు పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యం అవసరం



మాట్లాడుతున్న వర్దూ వర్సిటీ వీసీ పిఎస్ షావళి ఖాన్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సేవా పర్వ్‌లో ప్రజల భాగస్వామ్యం అవసరని వర్దూ వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పిఎస్ షావళీ ఖాన్ అన్నారు. బుధవారం యూనివర్సిటీలో కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ చేపట్టిన కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పర్వ్' నిర్వహించడం అభినందనీయమన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.మహబూబ్ బాషా, ఎన్ ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సిహెచ్ పాల్ కృపాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎస్ఎస్ఎస్ఎం హుస్సేని, వలంటీర్లు పాల్గొన్నారు.

సమాజానికి సేవ చేయాలి

విద్యార్థులు సమాజ సేవ చేయాలని ఉపకులపతి వి.వెంకట బసవరావు సూచించారు. బుధవారం రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఎస్ఎస్ డే 'సేవా సర్వ్' నిర్వహించారు. వాయు కాలుష్య నివారణ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలన, వినియోగాన్ని తగ్గించడం తదతర విషయాలను వివరించారు. పాండిచ్చేరీ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పనీర్ సెల్వం, ఎస్ దినేష, ప్రొఫెసర్లు ఎన్ టికే నాయక్, రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, ప్రిన్సిపల్ సీవీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి.నాగరాజు, కె. వెంకటరత్నం, నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాపారులపై వేధింపులు ఆపాలి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని రహదారుల పక్కన ఉండే చిరువ్యాపారులపై వేధింపులు ఆపాలని సీఐటీయూ నగర అధ్యక్షుడు అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. బుధవారం నగర పాలక అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ.కృష్ణకు వినతి పత్రం అందజేశారు. నిరుద్యోగులు ఫుట్‌పాత్‌పై చిన్న చిన్న వ్యాపారులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారని, నగర పాలక అధికారులు అమృత్ సిటీ పేరుతో దుకాణాలను తొలగిస్తామని హెచ్చరిక జారీచేయడం సరికాదన్నారు. రామాంజనేయులు, మహమూద్ ఉన్నారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్'

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యల పరిష్కారానికి గురువారం 'డయల్ యువర్ కమిషనర్' నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు 08518-221847 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యను నేరుగా కమిషనర్‌కు తెలియజేయవచ్చన్నారు. తాగునీటి సమస్య, వీధి దీపాల మరమ్మతులు, రహదారులు, పారిశుధ్య సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

ఎల్లన్నకు డాక్టరేట్

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా మిడుతూరు ప్రభుత్వ జూనియర్ కళశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు మంచికంటి ఎల్లన్నుకు బెంగుళూరు గీతం యూనియవర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. అసోసియేట్ ప్రొఫెసర్ ఆచార్య డా.కడియాల చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో ఎల్లన్న, నికెల్ గడలోనియం ఫెరిట్, నికెల్ యూరోపియం ఫెరిట్‌పై పరిశోధన చేశారు.



మెగా వైద్య శిబిరం

కోడుమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ మెగా వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. 185 మందికి వైద్య పరీక్షలు చేశారు. సుమారు 20 మంది రక్తదానం చేశారు. వైద్యాధికారి బి.నాగరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం అక్టోబరు 2 వరకు నిర్వహిస్తామన్నారు.

వసతి గృహాల తనిఖీ

సి.బెళగల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల ప్రత్యేకాధికారులు రమణ, గోసేనాయక్, వెంకట్‌ప్రకాశ్ వసతి గృహాలను తనిఖీ చేశారు. స్థానిక ఎస్సీ, బీసీ, గరుకుల, కస్తూర్బా వసతిగృహాలను పరిశీలించి, పరిసరాలను శుభ్రం చేయించారు. కలెక్టర్ అదేశాల మేరకు శుభ్రం చేయించామన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాణెమ్మ, డీప్యూటీ ఎంపీడీవో మహేశ్వరి ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యే క్రీడాకారులను జిల్లా అథ్లెటిక్ సంఘం కార్యదర్శి సుబ్బరత్నాలు బుధవారం ప్రకటించారు. వీరు జనన పత్రం, పదో తరగతి మార్కుల జాబిత, ఆదార్ కార్డు తీసుకుని 15న రాత్రి 9.30 గంటలుకు కర్నూలు రైల్వేస్టేషన్‌కు రావాలని సూచించారు. 8919409232 నెంబర్లో సంప్రదించాలన్నారు.

ఆటో డ్రైవర్లకు ఎంవీఐ హెచ్చరిక



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎంవీఐ రవీంద్రకుమార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 24, (ఆంధ్రజ్యోతి): పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎంవీఐ రవీంద్ర కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'జీవితాలతో ఆటోలాడుకుంటున్నారు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలోని వెంకటగిరి ఆటోస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జీవితం విలువైదని, పరిమికితి మించి ప్రయాణికులు ఎక్కించుకుని ప్రమాదం సంభవిస్తే కుటుం బాలు రోడ్డున పడతాయని తెలిపారు. ప్రభుత్వం రూ.15వేలు అందజేస్తోందన్నారు. రికార్డులు సక్రమంగా ఉంచుకోలని సూచించారు. కొత్తూరు, వెంకటగిరి రహదారిలో 8 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సాయంత్రం పట్టణంలో ఎంవీఐలు నాగరాజునాయక్, సుధాకర్‌రెడ్డి, ఏఎంవీఐలు బాబుకిశోర్, గణేష్‌బాబు వాహనాలను తనిఖీలు నిర్వహించారు.

పంట నమోదు చేసుకోవాలి



లక్ష్మీపురంలో మాట్లాడుతున్న జేడీ వరలక్ష్మి

కల్లూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులు తప్పక పంట నమోదు చేసుకోవాలని జేడీఏ పిఎల్.వరలక్ష్మీ సూచించారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఏవో విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో ఆమె పాల్గొన్నారు. జేడీ "మాట్లాడుతూ పంట పూర్తిగా కోతకు వచ్చే వరకు కోయవద్దన్నారు. పత్తిలో కాయకుళ్ల తెగులు నివారణకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. నానో యూరియా వాడితే దిగుబడి పెరుగుతుందని, రైతులకు కావలసిన డీఏపీ యూరియా, కాంప్లెక్స్ ఎరువులు రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏవో రంగారెడ్డి, ఏడీఏ శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌ను బలోపేతం చేయాలి



విద్యార్థులతో జనార్థనరెడ్డి

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుద్ వినియోగం పెరుగుతోందని, సౌర విద్యుత్తు వ్యవస్థలను బలోపేతం చేయాలని టాటా పవర్ సోలార్ రూఫ్‌టాప్ డీలరు, కీర్తి సోలార్ పవర్ ఏజెన్సీస్ అధినేత జనార్థనరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని మార్కెట్ యార్డులోని సంస్థ కార్యాలయంలో పీఎం సూర్యఘర్ యోజనపై అవగాహన సదస్సు నిర్వహించారు. 1 కె.వి.కి రూ.30వేలు, 2కె.వి. రూ.60వేలు, 3కె.వి.కి రూ.78 వేలు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. మూడు రోజుల శిక్షణ అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు ప్రదానం చేస్తామని తెలిపారు. డోన్, ఆలూరు ఐటీఐ ఏటీఓలు ప్రసాద్, ఎన్.రవికుమార్, సిబ్బంది షేక్ సిద్దిక్, శివరాముడు, సరస్వతి, నరేష్, కల్యాణి, యామిని, రేణుక పాల్గొన్నారు.

ప్రైవేట్ రవాణా యాప్‌లను రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లను దోపిడీ చేస్తున్న ప్రైవేటు రవాణా యాప్‌లను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అదానీ, అంబానీలకు చెందిన ఓలా, ఉబర్, రాపిడో సంస్థలు తక్కువ కమీషన్లు ఇచ్చి ఆటో డ్రైవర్లను దోపిడీ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బైక్ ట్యాక్సీలతో ఆటో డ్రైవర్లు నష్టపోతున్నారన్నారు. ప్రభాకర్, నగేష్, రాధాక్రిష్ణ, పెద్ద మాలిక్‌బాషా, శంషీర్ బాషా పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అభివృద్ధికి కృషి

● ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీడీఎం అభివృద్ధికి కృషి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హామీ ఇచ్చారు. బుధవారం జగన్నాథగట్టులోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విభాగాల అధిపతులతో సమావేశం నిర్వహించారు. క్యాంపస్‌లోని డ్రోన్లను పరిశీలించారు. ఈ క్యాంపస్ సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రితో పాటు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఎపరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఓర్వకల్లు వద్ద ఏర్పాటయ్యే డ్రోన్ల తయారీ పరిశ్రమను ట్రిపుల్‌ఐటీ కళాశాలలోని డ్రోన్ల ప్రవేశాలకు అనుసంధానం చేసేందుకు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని ఎంపి తెలిపారు.



ట్రిపుల్ ఐటీలో డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎంపీ

ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2,260 ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేఆయలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ప్రభుత్వం తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో 86 వేల మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉన్నారని వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హుశేన్‌బాషా, విక్రమ్, లోకేష్, నారాయణమ్మ, మధు, శ్రీను పాల్గొన్నారు.

ఉల్లి పంటల పరిశీలన

కోడుమూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరి, ప్యాలకుర్తి గ్రామాల్లో ఉల్లిపంటలను ప్రభుత్వ అగ్రివాచ్ కన్సల్టెంట్ ముస్లీహుదిన్ పరిశీలించారు. పెట్టుబడి, దిగుబడి, మార్కెటింగ్ ధరలను తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ అప్పులు చేసి పంటలు పండించామని, గిట్టుబాటు ధరలు లేవన్నారు.

కోడుమూరుకు చేరిన చేనేత యాత్ర

కోడుమూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిష్ణా జిల్లాలో ప్రారంభమైన చేనేత అధ్యయన యాత్ర బుధవారం కోడుమూరుకు చేరుకొంది. చేనేత కార్మిక సంఘం నాయకుడు మాధవస్వామి యాత్రకు స్వాగతం పలికారు. ప్రధాన కార్యదర్శి పి. నాగేశ్వరావు పట్టణంలోని గాంధీ విగ్రహానికినివాళి అర్పించారు. అనంతరం చేనేతల సమస్యలను తెలుసుకొన్నారు. నేతన్న భరోసా కింద ఏడాదికి రూ.36వేలు చెల్లించాలన్నారు. శ్రీరాములు, సులోచనమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రారంభ ఇబ్బందులు!

● వస్త్ర దుకాణం నిర్వాకంతో ప్రజల అవస్థలు
● భారీగా ట్రాఫిక్ జామ్.. రోగుల నరకయాతన




ఎవరేమైతే మాకేం.. సినీతారను చూసేందుకు రోడ్డుపై ఎగబడ్డ జనం

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఇటీవల ట్రాఫిక్ రద్దీ భారీగా పెరిగిపోతోంది. దీనికి తోడు పలు దుకాణాల నిర్వాహకుల తీరుతో ఈ సమస్య మరిన్ని సమస్యలను తెచ్చిపెడుతోంది. అసలే ఇరుకైన రోడ్లు, వాటికి తోడు రహదారులను ఆక్రమించుకుని కొందరు తోపుడు బండ్లు, తదితర వ్యాపారాలు చేసుకుంటూ ట్రాఫిక్‌ను పెంచేస్తున్నారు. ఇదే క్రమంలో బుధవారం నగరంలోని అమ్మ హాస్పిటల్ వద్ద వస్త్రాలయ వస్త్ర దుకాణం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఓ సినీ నటిని నిర్వాహకులు పిలిపించారు. అంతవరకు బాగానే ఉంది కానీ... ఇక్కడ కనీస చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దుకాణ నిర్వాహకుల వైఫల్యంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా ప్రధాన రహదారి కావడంతో ముందుగానే ఆర్టీసీ బస్సులను ఇతర వైపు నుంచి మళ్లించాలి. ఆ దిశగా నిర్వాహకులు, పోలీసులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ఈ ప్రాంతంలో ఆసుపత్రులు అధికంగా ఉన్నాయి. ఆసుపత్రులకు వెళ్లాల్సిన రోగులు సైతం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గంటల తరబడి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటంతో కొందరు ఇతర మార్గాల ద్వారా అవస్థలు పడుతూ గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నంద్యాల చెక్‌పోస్టు నుంచి నగరానికి, కర్నూలు నుంచి నందికొట్కూరుకు వెళ్లే బస్సులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. దుకాణ నిర్వాహకులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో ఈ సమస్య తలెత్తినట్లు స్పష్టంగా తలెత్తింది. ఇదే క్రమంలో పోలీసులు సైతం ట్రాఫిక్‌ను నియంత్రించలేక చేతులెత్తేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇదే కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ఎంపీ కోసం దారిని క్లియర్ చేసిన యాజమాన్యం ప్రజా ఇబ్బందులను గుర్తించలేకపోయింది. ఈ విషయంపై యాజమాన్యంతో పాటు ఎంపీపై కూడా ప్రజలు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు.



రహదారి ఎదుట రద్దీ



వాహనదారులకు శిక్ష.. ట్రాఫిక్‌జాం

పీ-4 బంగారు కుటుంబంపై శిక్షణ

వెల్దుర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ సుహాసినమ్మ ఆధ్వర్యంలో పీ-4 పై పంచాయతీ, సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ రవికి శోర్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో సర్వే నిర్వహించి బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జానకీబాయి, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

27న ఎస్సీల ఆత్మీయ సమ్మేళనం

మద్దికెర సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు పట్టణంలోని ఏ.క్యాంపులోని మైనర్ కాలేజీ ఆడిటోరియంలో ఈ నెల 27న ఉదయం జిల్లా వైసీపీ ఆత్మీయ ఎస్సీ, ఎస్టీల కార్యవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నాయకులు గంధం చంద్రశేఖర్, మల్లికార్జున పిలుపునిచ్చారు.

బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆలూరు రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి దసరా బన్నీ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, తహసీల్దార్ శోభాసువర్ణమ్మ సూచించారు. మండలంలోని అరికెర, అరికెరతండా గ్రామాల్లో అక్టోబరు 2న జరిగే బన్నీ ఉత్సవాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దేవరగట్టు బన్నీ ఉత్సవాల్లో కర్రల సమరం వద్దని కోరారు. మద్యం తాగి ఉత్సవాల్లో పాల్గొనవద్దనవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రమాదేవి, ఆర్ఐ బసవన్నగౌడ్, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు హులెప్ప, లింగన్న పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

ఆలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో నరసమ్మ, సూపర్‌వైజర్, ఓ అంగన్‌వాడీ వర్కర్‌పై కురవల్లి అంగన్‌వాడీ వర్కర్ భువనేశ్వరి ఇచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలపై పీడీ విజయ బుధవారం విచారణ చేపట్టారు. రూ.4 వేలు ఇవ్వాలని సీడీపీవో డిమాండ్ చేశారని, ఇవ్వకపోవడంతో వేధింపులకు గురి చేయడం వల్ల ఆసుపత్రి పాలయ్యాయని, అలాగే సూపర్‌వైజర్, ఓ అంగన్‌వాడీ వర్కర్ ద్వారా ప్రాజెక్టు పరిధిలో కమీషన్లు, పర్సంటేజీలు వసూలు చేస్తున్నారని చేసిన ఆరోపణలపై ఆధారాలు చూపించాలని అంగన్‌వాడీ వర్కర్ భువనేశ్వరిని కోరారు. అలాగే ఆరోపణలు ఎదర్కొంటున్న సీడీపీవోను కూడా విచారించారు. విచారణలో టీడీపీ నాయకులు సర్పంచ్ ఎల్లప్ప, నరసప్ప, ముద్దురంగ, గూళ్యం రామాంజనేయులు, వెంకన్న, గోవింద్ పీడీని కలిసి సీడీపీవోపై చర్యలు తీసుకుని బదిలీ చేయాలని కోరారు. జరిగిన సంఘటనపై ఇరువురితో పాటు సిబ్బందిని సెక్టార్ మీటింగ్‌లో ఉన్న మరికొందరిని విచారించామని తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని పీడీ విలేకరులకు తెలిపారు. మరోవైపు సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు మునిస్వామి, జేసీ నవ్యను కలిసి సీడీపీవోపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

'గంజాయి సాగు చట్టరీత్యా నేరం'

ఆదోని అగ్రికల్చర్/రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంట పొలాలలో గంజాయి మొక్కలు సాగు చేయడం చట్టరీత్యా నేరమని ఏడీఏ బాలవర్ధి రాజు, ఏవో సుధాకర్ హెచ్చరించారు. బుధవారం వారు మాట్లాడుతూ మండలంలోని ఓ రైతు పొలంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి మొక్కలను పోలీసులు ఇటీవల గుర్తించారన్నారు. సాగు చేసిన వారికి గరిష్ఠంగా 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. గ్రామాల్లో తమ సిబ్బంది క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలిస్తున్నారన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు: సీడీపీవో

ఆదోని రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీడీపీవో డిల్లీశ్వరి హెచ్చరించారు. పౌష్టికాహార మహోత్సవాల భాగంగా బుధవారం కపటి అంగన్‌వాడి సెంటర్లను తనిఖీ చేశారు. అనంతరం పలు రకాల మొక్కలను సెంటర్ల వద్ద నాటారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పుష్పావతి,హెల్త్ వర్కర్ మహాలక్ష్మి, సీహెచ్‌వో జయమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు రిజ్వాన, అనూరాధ, ఆశా, ఆయాలు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హాలహర్వి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):మల్లికార్జునపల్లిలో పేకాట స్థావరాలపై దాడులు చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మారుతి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అక్రమంగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి రూ.9,700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

మద్దికెర సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ కులవృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని మండల రజక సంఘం అధ్యక్షులు చిరంజీవి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ రజకులకు దోబి ఘాట్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే లాండ్రీ షాపులకు ఉచింగా విద్యుత్ ఇవ్వాలన్నారు. రజకులకు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ డీఏలు ఇవ్వాలి: ఎస్టీయూ

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను దసరా కానుకగా ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్రయాదవ్ కోరారు. బుధవారం ఎస్టీయూ ముఖ్యనాయకుల సమావేశం స్థానిక ఆర్ఆర్ లేబర్ కాలనీ పాఠశాలలో నిర్వహించారు. 11వ పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లు గడుస్తున్నా 12వ పీఆర్సీ పై కమిషన్ నియమించకపోవడం వల్ల ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. వెంటనే పీఆర్సీ కమిషనర్ నియామకాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ నాయకులు శ్రీరాములు, జయరాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పంటల సస్యరక్షణపై రైతులకు అవగాహన

తుగ్గలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పంటలు అధిక వర్షాలకు, తెగుళ్లకు, పురుగు ఆశించి దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ తెలిపారు. బుధవారం పెండేకల్‌లో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు.

'హౌస్ మ్యాపింగ్‌లో పొరపాట్లను సరిచేయాలి'

ఆదోని టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ మ్యాపింగ్ విధానంలో జరిగిన పొరపాట్లను సరిచేయాలని వీరశైవ జంగమ హక్కుల పోరాట సమితి నాయకులు కన్నె జగదీష్, గాజుల చంద్రశేఖర్ కోరారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు లభించని అనేక మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

చండీఘర్ మహాసభల్లో పత్తికొండ సీపీఐ నేతలు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో జరుగుతున్న సీపీఐ జాతీయ మహాసభలకు కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తరపున సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజినేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్‌శేఖర్, నక్కిలేనిబాబు తదితరులు హాజరయ్యారు.

కరివేములలో చోరీ

దేవనకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరివేములలో బుధవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. గ్రామానికి చెందిన హుస్సేన్‌సాహెబ్ కుటుంబం వ్యవసాయ పనులకు వెళ్లగా, మధ్యాహ్నం సమయంలో దొంగలు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని బంగారం, వెండి ఆభరణాలు దొచ్చుకెళ్లారు. కూతురు పెళ్లి కోసం దాచుకున్న బంగారం, వెండి ఆభరణాలు చోరీ జరిగిన్నట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. పత్తిపంట అమ్మగా వచ్చిన నగదు రూ.70 వేలు బీరువాలోని చీరలో దాచడంతో దొంగలు గుర్తించకపోవడంతో నగదు అలాగే ఉన్నట్లు బాధితుడు తెలిపారు. దేవనకొండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు.

'హామీల అమలులో ప్రభుత్వం విఫలం'

ఆదోని టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బారావు ఆరోపించారు. పట్టణంలోని మున్సిపల్ వర్కర్స్ యూనియన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ఆవరణలో ఓబీ నాగరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుబ్బారాయుడు మాట్లాడుతూ, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి అందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తామని నమ్మపలికిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుతం ఆప్కాస్‌ను కూడా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేస్తూ కనీస వేతనంగా రూ. 32000 చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, అధ్యక్షుడు అజయ్ బాబు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వెంకన్న, భీమేష్ స్థానిక నాయకులు పెద్ద ఎల్లప్ప, వీరప్ప, జాన్‌బాబు, శాంత, చిన్న ఎల్లప్ప పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తే చెత్త నుంచి సంపద సృష్టిస్తాం

తుగ్గలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇళ్లలో ఉన్న తడి పొడి చెత్తలను ఆరుబయట వేయకుండా వారికి చ్చిన తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులకు అందిస్తే చెత్త నుంచి సంపద సృష్టిస్తామని ఎంపీడీవో విశ్వమోహన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్నంపల్లిలో ఆయన పర్యటించి ఇంటింటి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. సమస్యను తెలియజేసిన వెంటనే ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తామన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే ఐవీఆర్ఎస్ కాల్స్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని ఆ సమస్య పరిష్కారమైతేనే కాల్స్ వస్తే 1 నెంబర్ నొక్కి సమస్య పరిష్కారమైందని తెలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తిక్ రంగనాథ్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ అధిక వాడకం వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఎంపీడీఓ కవిత ప్రజలకు సూచించారు. బుధవారం పత్తికొండ పట్టణంలో ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే నష్టాలపై అధికారులు పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పించారు.


డ్రగ్స్, గంజాయి సరఫరా చేస్తే చర్యలు


తుగ్గలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి వత్తు పదార్థాలను సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున హెచ్చరించారు. బుధవరాం పెండేకల్ ఆర్ఎస్ రైల్వే జంక్షన్‌లో ప్లాట్‌ఫారం, రైల్వేస్టేషన్ తోపాటు పార్సిల్ గది, రైల్వే బోగీలను క్లూజ్ టీమ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీ చేశారు.

'ప్రజలను రెచ్చగొట్టడం మానుకోవాలి'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

క్రిష్ణగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ప్రజలను రెచ్చగొట్టడం మానుకోవాలని తెలుగుదేశం నాయకులు కోయిలకొండ సర్పంచ్ లక్ష్మీఈశ్వరయ్య, చంద్రశేఖర్, రంగడు, మాధవకృష్ణ అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు కోయిలకొండ గ్రామానికి చెందిన రామలింగేశ్వర స్వామి మాన్యం భూములను ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారని ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి సోమవారం దేవదాయ శాఖాధికారులకు ఫిర్యాదు చేయాడాన్ని ఖండిస్తున్నామన్నారు.





దేవాలయ అభివృద్ధికి కృషి చేయండి


చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పారా రవికుమార్

మద్దికెర సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెరవలి గ్రామంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి పాలక వర్గం కృషి చేయాలని ప్రముఖ విరాళ దాత పారా విశ్వనాథ్ (చిట్టెన్న), ఆలయ ఈవో వీరయ్య అన్నారు. బుధవారం ఆలయ చైర్మన్‌గా పారా రవికుమార్ పాలకసభ్యులుగా వెంకటగిరి, నెట్టికంటయ్య, లక్ష్మీదేవి, మహాలక్ష్మి, ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, నాగప్ప, గోపాల్, రంగస్వాములు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మెడికల్ తిమ్మప్ప, సర్పంచ్ మల్లికార్జున, ఫక్కీరప్ప, వలి, పెద్దయ్య, నరసింహులుగౌడు, రంగస్వామి ఉన్నారు.



ఘనంగా భూపాల్ చౌదరి జన్మదిన వేడుకలు


భూపాల్ చౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఆదోని, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు తనయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి భూపాల్‌చౌదరి జన్మదిన వేడుకలను పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, యువ నాయకుడు మారుతినాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జీవనజ్యోతి అనాథ ఆశ్రమంలో అన్నదానం చేశారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, టీడీపీ యువ నాయకుడు నెట్టేకల్ మహేశ్, మండల అధ్యక్షుడు శివప్ప, బైచిగేరి హనుమాన్‌సింగ్, శ్రీనివాస ఆచారి, రామస్వామి, లక్ష్మీనారాయణ, నందమూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

మద్దికెర సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులు, బాలింతలు అందరికి ప్రత్యేక వైద్యశిభిరం నిర్వహించారు.





'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' నిర్మించాలి: ఎమ్మెల్యే బీవీ



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలోని ఎమ్మిగనూరు నియోజకవర్గంలో బనవాసి ప్రాంతంలో వేల ఎకరాలు ఉన్నాయని, అందులో ప్రజలకు వైద్యం అందించేందుకు నారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర విభజనలో భాగంగా రాష్ట్రానికి ఉన్న నిమ్స్ తెలంగాణలో ఉండిపోయిందన్నారు. దీంతో కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఎలాంటి మెరుగైన వైద్యసేవలు లేకపోవటం ఇబ్బందిగా మారిందన్నారు. తమ ప్రాంతాలనికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు గాను బనవాసి ప్రాంతంలో ఉన్న వేల ఎకరాల్లో నిమ్స్ నారా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికే ఎమ్మిగనూరులో ఉన్న 50పడకల ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలు చేసినట్లు తెలిపారు. అలాగే క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరా రు. గుండెపోటు వచ్చిన వారికి రూ. 40వేలు విలువ చేసే త్రాంబోలెట్ ఇంజక్షన్ ఇవ్వటంతో ఎంతో మంది ప్రాణాలు నిలుస్తున్నాయన్నారు. అలాగే ప్రతి సీహెచ్‌సీలో టెలి డయాగ్నోటిక్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రూ. 120 కోట్లతో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌ను అందుబాటులోకి తెచ్చారన్నారు. దీని వల్ల పేద ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలాగే కర్నూలు జీజీహెచ్‌లో న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ పూర్తి అయి రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. ఇక రూ. 46 కోట్లతో నిర్మిస్తున్న ఐపీడీ బ్లాక్ జీప్లస్ ఫైవ్ అయితే జీ ప్లస్ 2 పూర్తి అయిందని, ఈ భవనానికి నిధులు విడుదలచేస్తే రాయలసీమ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

గోనెగండ్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ప్రముఖ వ్యాపారవేత్త చంద్రశేఖర్ అన్నారు. గోనెగండ్లలో బుధవారం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. టీడీపీ మండల నాయకులు తిరుపతయ్య నాయుడు, రమణ, షేక్షావలి, రెహంతుల్లా, రఫీక్, రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు



దుర్గాదేవిని దర్శించుకుంటున్న నాయకులు

మంత్రాలయం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రపురంలో వెలసిన దుర్గాదేవిని సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీయ్య దర్శించుకున్నారు. బుధవారం శ్రీభవానీ యూత్ సభ్యులు, వేదపండితులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడే తాయమ్మ దేవతకు, మల్లికార్జునస్వామికి హారతులు ఇచ్చారు. శ్రీభవానీ యూత్ సభ్యులకు రూ.20వేలు, తాయమ్మ పూజారులకు రూ.5వేలు నగదును అందజేశారు. గోరుకల్లు కృష్ణ, మల్లికార్జున, జనార్దన్‌రెడ్డి, వీకేసీ రాఘవేంద్ర, మారెప్ప, గాలెప్ప, భీమ, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

'సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు'

కౌతాళం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల్లో మండలంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తే చర్యలు తప్పవని మండల విద్యాధికారులు రామాంజనేయులు, శోభారాణి హెచ్చరించారు. మండల కేంద్రమైన కౌతాళంలోని ఎమ్మార్సీ భవనం నందు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చుకుందాం

కౌతాళం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ కౌతాళం గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా మార్చి జిల్లాలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుదా మని కౌతాళం గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్ అన్నారు. పంచాయతీ కార్యాలయంలో బుధ వారం ప్లాస్టిక్ నిషేధంపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు చెత్త చెదారంను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పంచాయతీ వారు ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనంలో వేయాలని సూచిం చారు. పంచాయతీ కార్య దర్శి ప్రకాశం పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

మంత్రాలయం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంగభద్ర గ్రామంలో కర్నూల్ సుశీల నేత్రాలయ, తుంగభద్ర సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మురళీమోహన్ రెడ్డి, దశరథరెడ్డి అధ్యక్షతన కంటి పరీక్షలు చేశారు. తుంగభద్ర సేవాసమితి, భీమా యూత్ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

కౌతాళం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించి వారి ఎదుగుదలకు పాటుపడాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీరగోవిందమ్మ సూచించారు. కౌతాళంలో బుధవారం పోషకాహార వారోత్సవాలలో భాగంగా అంగన్ వాడీ కేంద్రం-3లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాల విలువ లపై అవగాహన కల్పించారు. అనంతరం వారికి పోషక కిట్‌లను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు విజయలక్ష్మి, ఖాశీం బీ, ఏఎన్‌ఎం ఉన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: దేవిబెట్ట గ్రామంలో బుధవారం 8వ రాష్ట్రీయ మాసోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నీలమ్మ, ఎంఎల్‌హెచ్‌వో జ్యోతీలు పోషణ మహోత్సవ ప్రత్యేకతను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్త సుమిత్ర దేవి, ఇందిర, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

మంత్రాలయం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పుణ్యక్షేత్రంలో హోటళ్లు, దుకాణాలను ధరల నియంత్రణ అధికారి శంకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఎమ్మార్పీ అధికంగా అమ్ముతున్న దుకాణ యజమానులకు నోటీసులు జారీచేశారు. ఓ దుకాణంలో అధికంగా అమ్ముతుండటంతో అపరాధ రుసుం వసూలు చేశారు.

తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిరప పంటలో తెగుళ్ళ, రసం పీల్చే పురుగుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ సూచించారు. మండలంలోని పెద్దమరివీడు గ్రామంలో బుధవారం ఏవో హేమలత ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పంటలను పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో రైతుల సమావేశం నిర్వహించారు. విస్తరణాధికారులు పులిరాజు, అరుణ, వ్యవసాయాధి కారులు మల్లికార్జున, మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.

కౌతాళం: నానో ఉత్పత్తులతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో శేషాద్రి అన్నారు. మండలంలోని బంటకుంట గ్రామంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని రైతులు, వ్యవసాయ సిబ్బందితో కలిసి నిర్వహించారు. అనంతరం రైతులకు యూరియాను అందజేశారు.

దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి

నందవరం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దేశాయి స్వగృహంలో బుధవారం అన్ని మతాలకు చెందిన 600 మందికి దుస్తులు పంపిణీ చేశారు. దసరా సందర్భంగా కులమతాలకతీతంగా దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ దేశాయి మాధవరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అలాగే పండుగ ముందు పేదలకు బియ్యం, బ్యాళ్లు పండగకు కావాల్సిన సామగ్రి కిట్లను ఇస్తామని తెలిపారు. ఏటా దసరా పండుగ రోజు తమ ఇంటి వద్ద నుంచి ఆంజనేయస్వామి గుడి మీదుగా శమీవృక్షం వరకు పూజ చేసిన ఆయుధాలతో ఉత్సవమూర్తిని ఊరేగిస్తారని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు సూచనలు ఇస్తున్న పోలీసులు

కౌతాళం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని కౌతాళం సీఐ అశోక్ కుమార్ ప్రజలకు సూచించారు. కౌతాళంలో బుధవారం సైబర్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్‌పై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత నియామాలపై అవగాహన కల్పించారు.

ప్రధాని మోదీ గొప్ప దేశ సేవకుడు: బీజేపీ



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గొప్ప దేశసేవకుడు అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అక్కమ్మ తోట రామకృష్ణ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బువారం ర్పాటు చేసిన సేవా పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా మహిళా పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. నాయకులు గురురాజ దేశాయ్, కౌన్సిలర్ దయాసాగర్, నాయకులు లలిత్ జైన్, ఈరన్న, నారాయణ, వెంకటాద్రి, రాజశేఖర్, శివ, బడేసాబ్, వెంకటేశ్, శివదాసు, బజారి, రమేష్, మాజీ సర్పంచ్ రామన్న గౌడ్‌లు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక: పట్టణంలోని 24,6,7,17,29 వార్డులకు చెందిన దాదాపు 77మంది బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. నాయకులు గురురాజదేశాయ్, వీజీఏ దయాసాగర్, బీఎల్ నారాయణ, బీఎస్ ఈరన్న, లోకేశ్, సురేంద్ర, శివ పాల్గొన్నారు.

రాఘవరాయలకు విశేష పుష్పాలంకరణ

మంత్రాలయం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాలంకరణ చేశారు., మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు.

ఈకేవైసీ తప్పనిసరి

నందవరం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ జాబ్ కార్డులకు ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలని ఏపీవో శ్రీనివాసులు సూచించారు. మండలంలోని ముగతి గ్రామంలో బుధవారం వారు ఇంటింటికి వెళ్లి ఈకేవైసీ చేయించారు. ఈ అవకాశాన్ని ఉపాధి కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ జి. శ్రీనివాసులు, సీవో ఈరన్న, టెక్నికల్ అసిస్టెంట్ మధుమతి, ఫీల్డ్ అసిస్టెంట్ కడుబూరి పాల్గొన్నారు.